సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



రిటైర్డ్ కార్మికుల తిప్పలు

సింగరేణి రిటైర్డ్ కార్మికులు సకాలంలో బెనిఫిట్స్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డాటా ఎంట్రీలో పొరపాట్లతో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. 8లో



వరికి తెగుళ్ల బెడద

వరి పంటను పీక, లద్దె పురుగులు ఆశిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /15.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఈవీఎంల భద్రత కట్టుదిట్టం

- కలెక్టర్ బాదావత్ సంతోష్



ఈవీఎంల బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్

నస్పూర్: జిల్లాలోని ఈవీఎం గోదాముల్లో భద్రపర్చిన ఈవీఎంల భద్రత కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. గురువారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ఈవీఎం గోదాములను జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరిలో ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి ఈసీఐఎల్ కంపెనీ నుంచి జిల్లా కు ఒక వెయ్యి 313 బ్యాలెట్ యూనిట్లు, ఒక వెయ్యి 25 కంట్రోల్ యూనిట్లు, ఎం-3 ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వచ్చాయని తెలిపారు. వాటిని ఈవీఎం గోదాములలో భద్రపరిచామని, భద్రతకు వివిధ శాఖల వారితో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

అర్హులకే డబుల్‌బెడ్రూం ఇళ్లు



జాబితాను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

రామకృష్ణాపూర్: ఇల్లు లేని నిరుపేదలకు గూడు కల్పించాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకంలో ఎలాంటి అవకతవకలకు చోటులేకుండా అర్హులైన లబ్ధిదారులకే కేటాయిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. గురువారం క్యాతనపల్లి మున్సిపాలిటీలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఆయన పరిశీలించారు. మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 2,431 మంది దరఖాస్తు చేసుకున్నారని, అర్హుల ఎంపికకు 13 బృందాలు ఏర్పాటు చేసి సర్వే చేస్తున్నామని తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండి ఇదివరకు ఇల్లు లేని వారికి కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణు, మందమర్రి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు పునరావాస పథకం

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అర్హులైన ట్రాన్స్‌జెండర్లు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్వయం ఉపాధి కింద యూనిట్ల మంజూరు కోసం ప్రభుత్వం జిల్లా సంక్షేమ శాఖ ద్వారా ఉపాధి పునరావాస పథకం అమలు చేస్తోందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కొట్టె చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని, వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలను స్థాపించుకుని తద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొంది, సాధారణ జీవనాన్ని గడపాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందని తెలిపారు. జిల్లాకు మూడు యూనిట్ల ద్వారా రూ.1.50 లక్షలు మంజూరు చేసిందని, దరఖాస్తు చేసుకునే ట్రాన్స్‌జెండర్లు జిల్లా కలెక్టర్ జారీ చేసిన గుర్తింపు కార్డు, కాంపిటెంట్ అథారిటీ జారీ చసిన ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్ కలిగి ఉండి, నేషనల్ పోర్టల్‌లో రిజిస్టర్ అయి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి'



కరపత్రాలు విడుదల చేస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: ప్రతీ గ్రామం, వార్డుల్లో నిర్వహించే కార్నర్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 10నుంచి 25వరకు రాష్ట్రవ్యాప్తంగా శక్తి కేంద్రమైన గ్రామం, వార్డుల్లో తలపెట్టిన కార్నర్ సమావేశాలపై గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో రఘునాథ్ వివరించారు. కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ భృతి వంటివి అమలు చేయలేదని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 300 కార్నర్ సమావేశాల ద్వారా జిల్లా ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. అందుగుల శ్రీనివాస్, రజనీష్ జైన్, పానుగంటి మధు, తోట మల్లిఖార్జున్, అక్కల రమేష్, పట్టి వెంకటకృష్ణ, రేవెల్లి రాజాలింగు, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పంట ఎండవట్టె.. కరెంట్ రాదాయే!



ఈ రైతు పేరు గోమాస రాజన్న. కన్నెపల్లికి చెందిన ఈయన నాలుగు ఎకరాల్లో వరి వేశాడు. గత రెండు వారాలుగా కరెంట్ సరఫరా సరిగా లేక పంట ఎండిపోయే పరిస్థితికి చేరింది. రోజంతా త్రీఫేజ్ ఇస్తున్నామని చెబుతున్న అధికారులు పది గంటలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని వాపోతున్నాడు. ఈ రైతే కాదు జిల్లాలో అనేక చోట్ల ఇటీవల అప్రకటిత కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ తీరును నిరసిస్తూ సబ్‌స్టేషన్ల ఎదుట, రోడ్లపై రైతన్నలు ధర్నాలు, నిరసనలు చేస్తున్నారు. గురువారం కన్నెపల్లి సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై ధర్నా చేశారు. అంతకుముందు వేమనపల్లి, దండేపల్లి మండలాల్లోనూ ఆందోళనలు జరిగాయి.

- వేసవికి ముందే కరెంట్ కోతలు మొదలు
- రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్న రైతన్నలు
- 24గంటల విద్యుత్ అంటూనే అంతరాయం

వ్యవసాయ విద్యుత్ వివరాలు(రోజు వారీగా)

విద్యుత్ డిమాండ్	2.7మిలియన్ యూనిట్లు
వినియోగం	2.4మిలియన్ యూనిట్లు
జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు	44,673
యాసంగి సాగు	97,425ఎకరాలు

సాక్షి, ప్రతినిధి, మంచిర్యాల/భీమిని: ఆరుగాలం శ్రమించే రైతులు కరెంట్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. వేసవికి ముందే సరఫరాలో అంతరాయం ఏర్పడి అవస్థలు పడుతున్నారు. రోజులో ఎప్పుడు కరెంట్ వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదని వాపోతున్నారు. జిల్లాలో వరి నాట్లు ముగింపు దశకు రాగా, ఇంకా కొన్ని చోట్ల వరి నాట్లు వేస్తున్నారు. ఆరుతడి పంటలతో పోలిస్తే వరికి నీరు అధికంగా అవసరం. బోర్లు, బావులు ఆధారంగా సాగయ్యే పొలాలకు మోటార్లు నడవాలంటే విద్యుత్ సరఫరానే ఆధారం. ఒక్క రోజు విద్యుత్ రాకున్నా నీరందక తడి ఆరిపోతుంది. దీంతో పొలంలో కలుపు పెరిగిపోతుంది. గడ్డి మొక్కలు పెరిగితే పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. రైతులకు కలుపు తీసేందుకు కూలీల అవసరం పెరిగి ఖర్చులు పెరుగుతాయి. సరిపడా నీరుంటే వరి పంటకు ఢోకా ఉండదు. జిల్లాలో నాట్ల దశ నుంచే నీరందించేందుకు ఇబ్బందులు ఎదురవుతుంటే వేసవిలో పరిస్థితి ఏంటని రైతులు వాపోతున్నారు.

24గంటల సరఫరా అంటూనే..

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24గంటల త్రీఫేజ్ కరెంట్ అందిస్తున్నట్లు చెబుతోంది. గతంలో రాత్రి, పగలు నిర్ణీత సమయంలోనే ఇచ్చే వారు. ప్రస్తుతం త్రీఫేజ్ కరెంట్ రోజంతా అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే అవసరం మేరకు 14నుంచి 16 గంటల కరెంట్ ఇస్తున్నామని అధికారులు అంటున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. పది గంటలు కూడా రావడం లేదంటున్నారు. ఒక్కోసారి ఇస్తున్న త్రీఫేజ్ సరఫరాలో కోత పెట్టి, మళ్లీ ఎప్పుడో ఇస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కచ్చితమైన సమయం పాటించకుండా, రైతులకు ముందస్తు సమాచారం లేకుండా కోతలు విధిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ముందుంది ఎండకాలం

ఇక నుంచి చలికాలం ముగిసి, రోజు రోజుకి ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ ఎండ తీవ్రత పెరుగనుంది. వరికి ఎక్కువగా నీరందాల్సి వస్తుంది. విద్యుత్ డిమాండ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడుతాయి. ఫీడర్ల సాంకేతిక సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, జంపర్లలో సమస్యలు ఏర్పడుతుంటాయి. గతేడు యాసంగిలో 82,517ఎకరాల్లో వరి సాగు కాగా, ఈ ఏడాది 95వేల ఎకరాలకు చేరింది. ఈ ఏడాది గత జనవరి విద్యుత్ వినియోగం చూస్తే 2.4మిలియన్ యూనిట్లు ఉంది. గత ఏడాది జనవరిలో వినియోగం 2.3మిలియన్ యూనిట్లుగా ఉంది. సాగు పెరిగి, విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోజు వారీగా వరంగల్ కేంద్రంగా ఉన్న ఉత్తర విద్యుత్ పంపిణీ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) నుంచి ఫోన్లకు వచ్చే మెసేజ్‌ల ఆధారంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు లోడ్‌తో కాలిపోవడం, ఫీడర్లలో ఇబ్బందులు, ఇతర సమస్యలతో ఎల్‌సీలు తీసుకుంటున్నారు. విద్యుత్ కోత సమయాన్ని పునరుద్ధరించేలా ఎక్కువగా సేపు ఇస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఇక విద్యుత్ సిబ్బందికి కూడా మెసేజ్‌లు గంట, అర గంట ముందే వస్తుండడంతో ముందస్తుగా రైతులకు సమాచారం ఇవ్వలేపోతున్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా



ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

భీమిని: విద్యుత్ కోతలతో పంటలకు నష్టం వాటిల్లుతోందని కన్నెపల్లి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై రైతులు గురువారం ధర్నా నిర్వహించారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రెబ్బెన, ముత్తాపూర్, కన్నెపల్లి, మాడవెల్లి గ్రామాల రైతులు సుమారు 200 మంది రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తోందని చెబుతున్నా మండల కేంద్రానికి అరకొరగా సరఫరా అవుతోందని, 24 గంటల ఉచిత విద్యుత్ ఉత్తదేనని మండిపడ్డారు. విద్యుత్ సరఫరా లేక నీరందక వరి, కూరగాయల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పగలు త్రీఫేజ్ విద్యుత్ ఉండడం లేదని, రాత్రివేళల్లో ఇస్తుండడంతో పొలాలకు వెళ్లే రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తమ సమస్యలు పట్టించుకోవడం లేదని, విద్యుత్ శాఖ అధికారులు వచ్చి సమస్య పరిష్కరించే వరకూ ధర్నా విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. విద్యుత్ శాఖ ఏడీ రాంచందర్, ఏఈ బాపు అక్కడికి రాగా వారిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నెపల్లి సబ్‌స్టేషన్ సిబ్బంది సరిగా సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఏడీ, ఏఈలు హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.

కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు



కరెంట్ ఎప్పుడొస్తుంది ఎప్పుడు పోతుందో తె లియడం లేదు. ఐదెకరాల పామాయిల్ తోట కు నీరు పెట్టడానికి రా త్రి పూట కరెంట్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది. ఇచ్చే పది గంటల కరెంట్‌లో కోతలు లేకుండా ఇవ్వాలి.

–ఎనగంటి శేఖర్‌రెడ్డి, గ్రామం: రాజారాం, మం: వేమనపల్లి

అంతరాయం లేకుండా సరఫరా

కొన్ని చోట్ల సాంకేతిక సమస్యలతో అంతరాయం ఏర్పడుతోంది. ఎక్కడైనా సమస్య వస్తే, వెంటనే అప్రమత్తమై ఆ ప్రాంత సిబ్బందిని అలర్ట్ చేస్తున్నాం. రైతులకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే పరిష్కరిస్తున్నాం. త్రీఫేజ్ కరెంట్ డిమాండ్ మేర సరఫరా ఇస్తున్నాం.

– ఆర్. శేషారావు, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్

త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వాలి



భీమిని: కన్నెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో పంటలు ఎండిపోకుండా త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలి. విద్యుత్ సక్రమంగా సరఫరా కాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. అధికారులు చర్యలు తీసుకొని త్రీఫేజ్ విద్యుత్ అందించాలి.

– చెండే పున్నం, రైతు, కన్నెపల్లి

ప్రజలకు నమ్మకం కలిగించాలి

- పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి
- పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న సీపీ రెమా రాజేశ్వరి

నస్పూర్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుకి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి సూచించారు. గురువారం నస్పూర్‌లోని సీసీసీ సింగరేణి గెస్టుహౌజ్‌లో ఆమె మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా భౌగోళిక పరిస్థితులు, నేరాలు, ఫ్యాక్టరీలు, సంస్థలు, సమస్యలు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో విచక్షణ, విజ్ఞతలతోపాటు మానవీయ కోణంతో పని చేయాలని అన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సబ్ ఇన్‌స్పెక్టర్ పాత్ర చాలా కీలకమని, పనితీరుపైనే ఆయా ప్రాంతంలో శాంతిభద్రతలు ఆధారపడి ఉంటాయని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ సిస్టంలో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే నేరాలు, సంఘటనల ఆధారంగా క్రైమ్ మ్యాపింగ్ చేసుకుని కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో జాప్యం చేయకుండా సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ ఆధారాలు, ఫోరెనిక్స్ సైన్స్ ద్వారా నేర పరిశోధన చేయాలని అన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు, నాకాబందీలు నిర్వహించాలని ఆదేశించారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, జైపూర్ ఏసీపీ నరేందర్, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మోహ న్, సీసీఎస్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఏసీపీ బా ల్‌రాజు, బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ మల్లిఖార్జున్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, భీమేష్, ఇన్‌స్పెక్టర్లు బాబురావు, కర్ణాకర్, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

11న బీసీ బడి పొలిటికల్ వర్క్‌షాప్

పాతమంచిర్యాల: ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో బీసీ బడి పొలిటికల్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీలకు జరుగుతున్న అన్యాయం, బీసీ మహనీయుల జీవితం, వారి పోరాటాలు, సమాచార హక్కు వినియోగం తదితర అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. బీసీ ఉద్యోగుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ సుంకరి రమేష్, పరిశోధకులు ఇట్యాల కిషన్, తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.జగన్మోహన్, బీసీ సంఘం నాయకులు హాజరవుతారని తెలిపారు.

పాఠశాలలకు మహర్దశ



ఎంపికైన మంచిర్యాల టీఎస్ మోడల్ స్కూల్

- పీఎంశ్రీ పథకానికి 33 ఎంపిక
- ఒక్కో స్కూల్‌కు రూ.2కోట్లు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని 33 పాఠశాలలకు మహర్దశ రానుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు బడులను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ(ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతీ మండలం నుంచి రెండు పాఠశాలలను ఎంపిక చేసి ఐదేళ్ల వ్యవధిలో రూ.2కోట్ల మేర నిధులు అందించేందుకు ప్రణాళిక రూపొందించింది. యూడైస్ వివరాలతో బెంచ్‌మార్కు కింద 81 పాఠశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. ఎంఈవో, పీజీ హెచ్‌ఎంల నేతృత్వంలోని బృందాలు మండల స్థాయిలో సందర్శించి జిల్లాలోని 53పాఠశాలలను గుర్తించారు. ఆన్‌లైన్‌లో పొందుపర్చిన అంశాలను బట్టి కేంద్రం నిర్దేశించిన ప్రమాణాలతో 36 పాఠశాలలు అర్హత సాధించాయి. వీటిలో కుందారం, పెద్దంపేట్, నారాయిపేట గ్రామాల్లోని ఎంపీపీఎస్‌లో ఎన్‌రోల్‌మెంటు తక్కువగా ఉండడం వల్ల ఎంపికకు నోచుకోలేదు. భీమిని మండలం నుంచి ఒక్క పాఠశాలకు కూడా స్థానం లేకుండా పోయింది. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా మిగతా 33 పాఠశాలలు ఎంపిక కాగా రాష్ట్ర అధికారులు కేంద్రానికి నివేదించారు.

పాఠశాలలు ఇవే..

బెల్లంపల్లి మండలంలో.. టీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐఎస్, కేజీబీవీ, టీఎస్‌ఆర్‌ఈఐఎస్(తాళ్లగురిజాల), భీమారం–జెడ్పీహెచ్‌ఎస్, చెన్నూర్‌లో సుద్దాల ఎంపీపీఎస్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెన్నూర్, దండేపల్లిలో జెడ్పీహెచ్‌ఎస్(దండేపల్లి), రెబ్బనపల్లి, హాజీపూర్‌లో ఎంపీయూపీఎస్(పడ్తన్‌పల్లి), జెడ్పీహెచ్‌ఎస్(దొనబండ), జైపూర్‌లో ఎంపీయూపీఎస్ టేకుమట్ల, ఎంపీయూపీఎస్(వేలాల), జన్నారంలో ఎంపీయూపీఎస్(తిమ్మాపూర్), జెడ్పీహెచ్‌ఎస్(గర్ల్స్) జన్నారం, కన్నెపల్లిలో ఎంపీపీఎస్ జనకాపూర్, కాసిపేట మండలంలో ఎంపీపీఎస్ దేవాపూర్, టీఎస్‌ఎంఎస్(కాసిపేట), కోటపల్లి మండలంలో ఎంపీపీఎస్ దేవులవాడ, జెడ్పీహెచ్‌ఎస్ దేవులవాడ, లక్సెట్టిపేటలో ఎంపీపీఎస్ జెండా వెంకటపూర్, ఎంపీపీఎస్ లక్ష్మీపూర్, లక్సెట్టిపేట మున్సిపాల్టిటీలో ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌ఈఐఎస్, టీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐఎస్, మంచిర్యాల మున్సిపాలిటీలో ప్రభుత్వ పాఠశాల ఏసీసీ, టీఎస్‌ఎంఎస్ మంచిర్యాల, మందమర్రి మున్సిపాలిటీలో ఎంపీపీఎస్ ఫిల్టర్‌బెడ్, టీఎస్‌ఎంఎస్ మందమర్రి, నస్పూర్‌లో ఎంపీపీఎస్ సంఘమల్లయ్యపల్లె, జెడ్పీహెచ్‌ఎస్ తీగలపహాడ్, నెన్నెల మండలంలో జెడ్పీహెచ్‌ఎస్ ఆవడం, ఎంపీపీఎస్ మైలారం, తాండూర్‌లో జెడ్పీహెచ్‌ఎస్ రేచిని, వేమనపల్లి మండలంలో జెడ్పీహెచ్‌ఎస్ నీల్వాయి పాఠశాలలు ఎంపికయ్యాయి.

ఇవీ ప్రయోజనాలు

విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక సాంకేతిక వనరుల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదారంగా నిధులు కేటాయిస్తాయి.

- పాఠశాలల్లో సౌర విద్యుత్, ఎల్‌ఈడీ విద్యుత్ దీపాల ఏర్పాటు, తోటల పెంపకం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత చర్యలు, బొమ్మలతో బోధన, విద్యార్థుల సామర్థ్యాల మదింపు వంటివి చేపడుతారు.
- ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- విద్యార్థుల్లో భాషా పరమైన అవరోధాలు అధిగమించడానికి అవసరమైన సాంకేతిక సౌకర్యాలు కూడా అందుబాటులోకి తెస్తారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కింద 12 రకాల సౌకర్యాలతో బడి రూపురేఖలు మార్చుతుండగా ఇంకోవైపు ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో పీఎంశ్రీతో మహర్దశ రానుంది. నిధుల కేటాయింపుపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

- మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కెకాన్
- వేలాలలో జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ సుధీర్ రాంనాథ్

జైపూర్: వేలాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కెకాన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని వేలాలలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 18నుంచి మూడు రోజులపాటు జరిగే మల్లన్న స్వామి జాతర ఏర్పాట్లను గురువారం ఆయన జైపూర్ ఏసీపీ నరేందర్‌తో కలిసి పరిశీలించారు. వేలాల గుట్టపై దొణలో మల్లన్నస్వామి దర్శించుకుని ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ ప్రశాంత వాతావరణంలో దేవుడిని దర్శించుకుని తిరిగి క్షేమంగా ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా రోడ్డు మరమ్మతులు చేయించాలని, ట్రాఫిక్ సమస్య రాకుండా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని చెప్పారు. మొదటి రోజున గుట్ట కింద జాతర, రెండో, మూడో రోజున గుట్ట కింద మల్లికార్జున స్వామి జాతర కొనసాగించేందుకు అధికారులు చేపట్టే ఏర్పాట్లను వివరించారు. గోదావరి నదిలో నీటి నిల్వ ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున భక్తులను అప్రమత్తం చేస్తూ గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎస్సై రామకృష్ణ, స్థానిక ఆలయ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై అధికారుల కొరడా



హద్దురాళ్లను తొలగిస్తున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని 210 సర్వే నెంబర్‌లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి హద్దురాళ్లు వేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రతిభ తహసీల్దార్ రాజలింగు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సంఘటన స్థలానికి చేరుకుని అక్రమ కట్టడంపై విచారణ జరిపి సర్వే చేశారు. ప్రభుత్వ భూమిని కొందరు గుట్టుగా కబ్జా చేసి అక్రమంగా హద్దురాళ్లు వేశారని సర్వే ఆధారంగా గుర్తించి వాటిని తొలగింపజేశారు. స్థలం చుట్టూ ట్రెంచింగ్ చేయించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కట్టడాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాజలింగు హెచ్చరించారు. గిర్దావర్ లావణ్య, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా నిలపాలి



మాట్లాడుతున్న డీపీఓ ఫణీందర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్ఠం చేయడంతోపాటు పంచాయతీల పర్యవేక్షణలో అలసత్వం వహించొద్దని, నిబద్ధతతో పని చేస్తూ గ్రామాలను ఆదర్శంగా నిలపాలని జిల్లా పంచాయతీ అధికారి ఫణీందర్‌రావు తెలిపారు. గురువారం ఆయన డీపీవో కార్యాలయంలో డీఎల్‌పీఓ, ఎంపీఓలతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీపీఓ ఫణీందర్‌రావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు పంచాయతీల్లో హాజరు నమోదు చేసి డీఎస్ఆర్, నాలుగు ఫొటోలు అప్‌లోడ్ చేసేలా పర్యవేక్షించాలని అన్నారు. పన్నుల వసూళ్లు వేగవంతం చేసి ఎప్పటికప్పుడు రసీదు పుస్తకాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని తెలిపారు. ఎంపీఓలు నర్సరీ పనులు పరిశీలించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల వివరాలు, పంచాయతీ కార్యదర్శుల వివరాలు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఎంపీఓలను ఆదేశించారు. డీఎల్‌పీఓ ప్రభాకర్‌రా వు, ఎంపీఓలు శ్రీపతి బాపు, అజ్మత్‌అలీ, సతీశ్‌కుమార్, సఫ్దర్‌అలీ, సత్యనారాయణ, శ్రీనివాస్, అనీ ల్, సతీశ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేయాలి

పాతమంచిర్యాల: ఉపాధి హామీ పథకం ఉద్యోగులను పే స్కేల్ వర్తింపజేయాలని గురువారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం జేఏసీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఏడాది అసెంబ్లీ సమావేశాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించారని తెలిపారు. ప్రస్తుత సమావేశాల్లో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ ఏప్రిల్ 2023 నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటన చేశారని, కానీ ఉపాధి హామీ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటించకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పే స్కేల్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రమేష్, కో కన్వీనర్లు దుర్గాదాస్, సత్యనారాయణ, జగన్, మస్తాన్ శ్రీనివాస్, కోశాధికారి సదానందం, లీగల్ అడ్వైజర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నలుగురు బీట్ అధికారులకు పదోన్నతి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు బీట్ అధికారులకు సెక్షన్ ఆఫీసర్లుగా పదోన్నతులు లభించాయి. కవ్వాల్ బీట్ అధికారి కృష్ణ, దొంగపల్లి బీట్ అధికారి శంకర్, చింతపల్లి బీట్ అధికారి అర్చన, మల్యాల బీట్ అధికారి మీర్జా జియా ఉల్ల భేగ్‌లకు పదోన్నతి కల్పిస్తూ చీఫ్ కన్జర్వేటర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 22 వ తేది వరకు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, ఉమ్మడి జిల్లా పరిధిలో 50 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

రేపు ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.చక్రపాణి తెలిపారు. 5 సీట్ల కోసం 994 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగజ్‌నగర్ త్రిశూల్ పహాడ్ జవహర్ నవో దయ విద్యాలయంతో పాటు సెయింట్ క్లారెట్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని, 11.15 గంటల తర్వాత లోనికి అనుమతించమని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి ఆన్‌లైన్ నుంచి హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకొని రావాలని, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమన్నారు.

దాడి కేసు నమోదు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని ఆర్కే 6 లక్ష్మీనగర్‌కు చెందిన రోజారాణిపై దాడికి పాల్పడిన అదే ప్రాంతానికి చెందిన రాదారపు రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మానస ఒక ప్రకటనలో తెలిపారు. రోజారాణి భర్త భాస్కర్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి గ్రామానికి చెందిన మామిడిపెల్లి సంతోష(39) కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందింది. హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కర్ణమామిడికి చెందిన మామిడిపెల్లి సంతోష 15 సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయింది. ఈ నెల 2న రాత్రి దోమల నివారణకు పేపర్ వెలిగించే క్రమంలో తన దుస్తులకు నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి, వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి బాబాయ్ కలమడుగు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

రెడ్డికాలనీలో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీలో నివాసం ఉంటున్న కుర్ర జయదేవ్ బాబు ఇంట్లో చో రీ జరిగినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. జయదేవ్‌బాబు సతీమణి అనారోగ్యం బారిన పడడంతో చికిత్సకోసం ఈ నెల 2న హైదరాబాద్‌కు తీసుకెళ్లా రు. గురువారం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో ఉన్న రూ.5 లక్షల విలువైన 25 తులాల బంగారు ఆ భరణాలు అపహరణకు గురయ్యాయని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రిటైర్డ్ కార్మికుల తిప్పలు



గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయం

- డాటా ఎంట్రీలో పొరపాట్లు
- పలువురికి నిలిచిపోయిన పెన్షన్లు
- సీపీఆర్ఎంఎస్ కార్డుల జారీలోనూ జాప్యం

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులు తమకు రావాల్సిన బెనిఫిట్స్ సకాలంలో అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో రిటైర్డ్ కార్మికులది ఇదే పరిస్థితి. రిటైర్డ్ అయిన తర్వాత కార్మికులకు వైద్య చికిత్సల కోసం కంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీం కింద మెడికల్ కార్డులను జారీ చేస్తారు. సర్వీసులో ఉన్నప్పుడే దీని కోసం ముందుగానే కార్మికుడి వద్ద నుంచి రూ.40 వేలు రికవరీ చేసి రిటైర్డ్ అయిన తర్వాత భార్యాభర్తలకు మెడికల్ కార్డులు జారీ చేస్తారు. అయితే రిటైర్డ్ కాకముందే డబ్బులు రికవరీ అయినా కూడా ఉద్యోగ విరమణ పొందిన వెంటనే కార్డులు మాత్రం జారీ కావడం లేదు. ఇందుకు కనీసం రెండు నుంచి మూడు నెలల సమయం పడుతోంది. మూడు నెలల్లోగా కార్డు తీసుకోవాలని కంపనీ నిబంధనలు ఉన్నా చివరి సమయంలో కార్డులు అందుతున్నాయని రిటైర్డ్ కార్మికులు పేర్కొంటున్నారు. ఈ మధ్యకాలంలో ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే దూరప్రాంతాల్లో ఉన్న వారు ఆస్పత్రిలో చేరితే మెడికల్ కార్డులేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీని కోసం ప్రత్యేకంగా జీఎం కార్యాలయానికి వెళ్లి లెటర్ రాయించుకుని రావాల్సిన పరిస్థితి ఉందని రిటైర్డ్ కార్మికులు వాపోతున్నారు. రిటైర్డ్ అయిన మరుసటి రోజే కార్డు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సెటిల్‌మెంట్ చేస్తున్నాం

రిటైర్డ్ కార్మికులు కంపెనీ కోరిన పత్రాలను సరైన సమయంలో అందిస్తే సెటిల్‌మెంట్స్ అన్ని వెంటనే జరుగుతున్నాయి. కొన్ని కోర్టు కేసుల్లో ఉన్న వాటికే ఆలస్యం అవుతున్నాయి. అంతే తప్ప ఎక్కడా జాప్యం లేకుండా త్వరగా సెటిల్‌మెంట్ చేస్తున్నాం.
– గోవిందరాజు, డీజీఎం(పర్సనల్), శ్రీరాంపూర్

12 వేల మందికి ఆగిన పెన్షన్..

సింగరేణి వ్యాప్తంగా సుమారు 12 వేల మంది రిటైర్డ్ కార్మికులకు ఈ ఏడాది జనవరి మాసానికి సంబంధించిన పెన్షన్లు నిలిచిపోయాయి. రిటైర్డ్ కార్మికులు తమ జీవన్ ప్రమాణ్(లైవ్ సర్టిఫికెట్)లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో జరిగిన సాంకేతిక తప్పిదాలతో పెన్షన్లు నిలిచిపోయాయని తెలిసింది. ఏటా డిసెంబర్ చివరి నాటికి లైవ్ పత్రాలను మీసేవ కేంద్రాల్లో సమర్పించాల్సి ఉంటుంది. కొంతమంది సెంటర్ నిర్వాహకులు పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేసే క్రమంలో చేసిన తప్పిదాల కారణంగా చాలా మంది కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఇది సింగరేణి పరిధిలో ఉండదు కాబట్టి కార్మికులు గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గ్రాట్యుటీ, సీఎంపీఎఫ్ చెల్లింపుల్లో కూడా అన్ని ఏరియాల్లో జాప్యం జరుగుతోందని రిటైర్డ్ కార్మికులు పేర్కొంటున్నారు. కారుణ్య ఉద్యోగాల పేరుతో ఇటీవల మెడికల్ ఇన్వాలిడేషన్ కింద ఎక్కువ మంది కార్మికులు రిటైర్డ్ అవుతుండటంతో వారు తమ క్వార్టర్‌ను కంపెనీకి అప్పగించడం లేదు. క్వార్టర్ అప్పగించకుంటే గ్రాట్యుటీ చెల్లించడం జరగదని అధికారులు పేర్కొంటున్నారు. డిపెండెంట్ ఉద్యోగంలో చేరాక అప్పుడు వారుంటున్న క్వార్టర్ డిపెండెంట్‌కు అలాట్ చేసిన తర్వాతే రిటైర్డ్ ఉద్యోగి వెకేట్ చేయడం, గ్రాట్యుటీ చెల్లించడం జరుగుతుంది. దీనికి కొన్ని నెలల సమయం పడుతుంది. ఈ నిబంధనను సరళతరం చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే మొన్నటి వరకు దీపావళి బోనస్, లాభాల బోనస్ చెల్లింపులు మందమర్రి వంటి ఏరియాలో ఇంకా మొదలు కాలేదు.

వరికి తెగుళ్ల బెడద



పీక పురుగు ఆశించిన వరి పంట

- పంటను ఆశిస్తున్న పీక, లద్దెపురుగులు
- ఆందోళనలో అన్నదాత

చెన్నూర్‌రూరల్: ఈ ఏడాది యాసంగి సీజన్‌లో వరి నాట్లు ఇంకా కొనసాగుతున్నాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 98,521 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. చెన్నూర్ మండలంలో 13 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి మాసంలో నాటువేసిన పంటలను పీక పురుగు, లద్దె పురుగు ఆశించింది. దీంతో రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు.

తెగుళ్లు.. లక్షణాలు

లద్దె పురుగు సోకితే వరి ఆకుల చివరలను కొరికి ఆకుల అంచుల వెంబడి కత్తిరిస్తూ మొక్కల మొదళ్లను కూడా తింటుంది. పొలంలో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు వీటి ఉధృతి తక్కువగా ఉంటుంది. వరి మొక్కలు ఎర్రబడటం, ఆకులపై తుప్పు వర్ణపు మచ్చలు కలిగి క్రమేపి మొక్కలు చనిపోతాయి. పిలకలు వేసే దశలో వరి ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా అనుకూల పరిస్థితుల లో ఇవి పెద్దగా మారుతాయి. మచ్చల చివర్లో మొనతేలి ఉంటుంది. దీంతో ఆకులు పాక్షికంగా లేదా మొత్తం ఎండిపోతాయి. దూరం నుంచి చూస్తే పంట తగులబడినట్లు కనిపిస్తుంది.

నివారణ చర్యలు చేపట్టాలి



లద్దె పురుగు నివారణ కోసం ఫ్లూబెండియామైడ్ 0.1ఎంఎల్ లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3ఎంఎల్ లీటరు నీటికి కలిపి సాయంత్ర పిచికారీ చేయాలి. పొలంలో పూర్తిగా నీళ్లు పెట్టి పురుగు మందు పిచికారి చేస్తే మంచిది. దీని నివారణకు పొలంలో నీరు నిల్వ ఉంచుతూ తీసివేస్తూ కొత్త నీరు పెట్టడం చేయాలి. తద్వారా లవణాల సాంద్రత పెరగకుండా నిరోధించవచ్చు. సూక్ష్మ పోషకాలైన ఫార్ములా–4, చిలామెన్‌వంటి మందులు పిచికారీ చేయాలి.
– కవిత, ఏవో, చెన్నూర్

కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్కే 6 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ వద్ద వందలాది ఎకరాల భూములు నిరుపయోగంగా ఉన్నాయని, వీటిలో కార్మికులకు రెండు గుంటల చొప్పున ఇళ్ల స్థలం ఇవ్వాలని, కోలిండియాలో మాదిరిగా పెర్క్స్‌పై ఐటీని కంపనీ రీయింబర్స్‌మెంట్ చేయాలని, కార్మికులు తీసుకోని క్వార్టర్లు ఉంటే కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. లేదంటే కార్మికుల మనుగడే ప్రశ్నార్థకంగా మారనుందన్నారు. గనుల్లో ప్రమాదాలు జరిగితే ఉన్నతాధికారుల మన్ననల కోసం ప్రమాదాల సంఖ్యను తక్కువగా చూపుతున్నారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతీ ప్రమాదాన్ని రిపోర్టుగా రాయాలన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, నాయకులు గొర్రె నర్సయ్య, సంఘం సదానందం, తోట మహేశ్, కారుకూరి నగేశ్, చిలుక రాంచందర్, బాలసారి లక్ష్మణ్, క్రాంతికుమార్, దాసరి రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బొగ్గు బ్లాకులను అడ్డుకుంటాం



కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): కేంద్ర ప్రభుత్వం సింగరేణిలో ప్రైవేటుపరం చేసిన కోయగూడెం బొగ్గుబ్లాకు పనులు అడ్డుకుంటామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు అన్నారు. గురువారం ఎస్సార్పీ 1 గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వీటిని అడ్డుకోకుంటే ముందు సింగరేణిలో మరిన్ని బొగ్గు బ్లాకులు ప్రైవేటుపరం అవుతాయన్నారు. రాష్ట్ర సర్కార్ వీటిని అడ్డుకోవడంలో విఫలమైందన్నారు. కార్మికులు పోరాడితేనే సంస్థ మనుగడ సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిసే స్వామి, ఏరియా సెక్రటరీ సమ్ము రాజయ్య, నాయకులు వెంకటేశ్, కుమారస్వామి, జీవన్‌రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దేశం గర్వించేస్థాయికి ఎదగాలి



వీఆర్‌కే ప్రసాద్‌కు పూలబొకే అందిస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల స్థాయిలోనే జీవిత లక్ష్యాలు ఏర్పర్చుకుని దేశం గర్వించేస్థాయికి ఎదగాలని ఇండియన్ ఆర్మీ విశ్రాంత కల్నల్, ఇక్ఫాయ్ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ డా.వీఆర్‌కే ప్రసాద్ అన్నారు. 1964లో మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎస్‌సీ చదివిన వీఆర్‌కే ప్రసాద్ గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన కాగిత పుష్పాలను ఆయనకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలే నా జీవితానికి స్ఫూర్తి అన్నారు. పౌరులు దేశభక్తి, బాధ్యత, విలువలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆసూరి వేణుగోపాల్, ఉపాధ్యాయులు గుండేటి యోగేశ్వర్, గోలి మనోహర్, శ్రీనివాస్, మహేష్, వర్మ, నాగరాజు, చారి, సునీతాదేవి, రంగరాణి, నీల్ కమల్, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య



రాజం మృతదేహం

తిర్యాణి(ఆసిఫాబాద్): మద్యానికి బానిసై ఒ కరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం కొత్తగూడలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మొర్రిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడకు చెందిన వెల్మల రాజం(43) నిత్యం మద్యం సేవిస్తూ కుటుంబాన్ని పట్టించుకోకుండా తి రుగుతుండేవాడు. బుధవారం గ్రామ సమీ పంలోని జొన్న చేనుకు కాపలా ఉంటానని వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో అత ని భార్య భీమక్క చేను వైపుకు వెళ్తుండగా దా రిలో గుర్తు తెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించింది. స్థానికుల సాయంతో మంచిర్యాలలో ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



పంటలు పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్(చెన్నూర్): వేరుశనగ సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు పాటించడం వలన అధిక లాభాలు ఆర్జించవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్‌నాయక్ తెలిపారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా గురువారం జైపూర్ మండలంలోని పౌనూర్, గోపాల్‌పూర్, గోదారిపల్లి గ్రామాల్లో పర్యటించి వేరుశనగ పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వేరుశనగ పంటలో తిక్కాకు మచ్చ తెగులును గుర్తించామని, దీని నివారణకు లీటరు నీటికి 1మిల్లీ లీటర్ చొప్పున టెబ్యుకోనజోల్ అనే శిలీంద్రనాశిని పిచికారీ చేయాలన్నారు. గూడలు దిగే సమయంలో శాస్త్రవేత్తలు సూచించిన మేరకు జిప్సం వాడిన రైతు క్షేత్రాలలో గింజ పరిమాణం, నాణ్యత రంగు మెరుగ్గా ఉందన్నారు. నూనె శాతం పెరగడంతో పాటు కోత సమయం కూడా తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఏడీఏ బాపు, శాస్త్రవేత్తలు డాక్టర్ శివకృష్ణ, నాగరాజు, జైపూర్ మండల వ్యవసాయ శాఖ అధికారి మార్క్‌గ్లాస్టన్, స్థానిక సర్పంచ్ సారయ్య, ఉపసర్పంచ్ స్వామి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాండూర్(బెల్లంపల్లి): ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ కాంగ్రెస్, సీపీఐ నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తాండూర్, రేచిని, కాసిపేట శివారుల్లోని ప్రభుత్వ భూములు ఇప్పటికే కబ్జా అయ్యాయన్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ,అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను రెవెన్యూ ఆధీనంలోకి తీసుకుని వాటికి పకడ్బందీగా హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. లేని పక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరం దామోదర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాపర్తి సుభాష్, సీపీఐ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, మాజీ జెడ్పీటీసీ బండి పోశం, నాయకులు అనిల్, అలీ, షేక్ హైమద్, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే డీజిల్ ఇప్పిస్తానని మోసం

సిర్పూర్(టి): తక్కువ ధరకే డీజిల్ ఇప్పిస్తానని చెప్పి మోసానికి పాల్పడ్డాడు ఓ ఘరానా దొంగ. సిర్పూర్(టి) ఎస్సై ఢీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన ఆడె రాజశేఖర్ ఈ నెల 3న తన ట్రాక్టరుతో మెయిన్‌రోడ్ పక్కనే ఉన్న చేనులో దున్నుతుండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తక్కువ ధరకు డీజిల్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన రాజశేఖర్ అతన్ని తీసుకుని ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న రూ.12వేల నగదు తీసుకుని తన తమ్ముడితో కలిసి మోటార్ సైకిల్ (టీఎస్ 20 6724)పై బయలుదేరారు. వేంపల్లి శివారులో రాజశేఖర్ వాహనం దిగి తన తమ్ముడిని డీజిల్ కొరకు సిర్పూర్(టి) వైపు పంపించాడు. సిర్పూర్(టి)లోని పెట్రోల్ పంపు వద్దకు వెళ్లిన తర్వాత ఇక్కడి వరకే వెళ్లి వస్తానని చెప్పి నగదుతో పాటు బైక్ వేసుకుని ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

ఇచ్చోడ(బోథ్): అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్ తెలిపారు. బజార్‌హత్నూర్ మండలంలోని చందునాయక్ తాండకు చెందిన కాత్లె చంద్రభాన్ (50) మద్యానికి బానిసై ఆర్నెల్లుగా ఇంటికి వెళ్లకుండా మండల కేంద్రంలోనే తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం అతిగా మద్యం సేవించి పోస్టాఫీసు ముందున్న ఓ భవనంపైకి ఎక్కి పడుకున్నాడు. గురువారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు.

అద్దె బస్సులపై 10శాతం రాయితీ

- జూన్ 30 వరకు వర్తింపు
- ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి

ఆదిలాబాద్: అద్దె బస్సులపై 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కే.జానీరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రకాల సర్వీసులపై ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. గతంలో కార్తీక మాసం, వనభోజనాలు, శబరిమల అయ్యప్ప దర్శనం సందర్భంగా ఈ రాయితీ కల్పించగా గత ఏడాది డిసెంబర్ 31తో గడువు ముగిసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం శుభకార్యాల సీజన్ నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ఈ ఏడాది జూన్ 30వరకు రాయితీని పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రైవేట్ వాహనాలతో పోలిస్తే తక్కువ ధరకే ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తోందని, ఎలాంటి నగదు డిపాజిట్ లేకుండానే ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందస్తు బుకింగ్ కోసం www.tsrtconline.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, వివరాలకు స్థానిక డిపో మేనేజర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రియుడి ఇంటిఎదుట బైఠాయింపు



ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన యువతి

తాండూర్(బెల్లంపల్లి): తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించిన ప్రియుడి ఇంటి ఎదుట ఓ యువతి బైఠాయించిన ఘటన గురువారం మండలంలోని అచ్చులాపూర్‌లో చోటు చేసుకుంది. అచ్చులాపూర్ గ్రామానికి చెందిన అడ్వాల కృష్ణ , తేంద్ర స్వప్న కాలేజీలో చదువుకున్నప్పటి నుంచి స్నేహితులు. వారి స్నేహం కాస్తా ప్రేమగా మారింది. తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి స్వప్నను నమ్మించిన కృష్ణ తన అవసరాలు తీర్చుకున్నాడు. పెళ్లికి ఇరువురి పెద్దలు అంగీకరించలేదు. సదరు యువతికి వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. ఆ తర్వాత కూడా కృష్ణ తరచూ ఫోన్ చేసి భర్తతో కాపురం చేయవద్దని, తాను పెళ్లి చేసుకుంటానంటే మరొకరిని ఎలా పెళ్లి చేసుకున్నావని మానసికంగా వేధించడం ప్రారంభించాడు. తనవద్ద ఉన్న ఫొటోలు, వీడియోలు బయటపెడ్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. భర్తకు విడాకులిస్తే పెళ్లి చేసుకుంటానని నమ్మ బలకడంతో విడాకులు ఇచ్చింది. ఆతర్వాత కృష్ణ మరో అమ్మాయిని వివాహం చేసుకోవడంతో మూడు రోజుల క్రితం తాండూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకూ పోలీసులు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించింది. ఆమెకు పలువురు మహిళలు సంఘీభావం ప్రకటించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

క్రీడా ప్రాంగణంలో సామగ్రి చోరీ



దొంగలు కోసుకెళ్లగా మిగిలిన పైపులు

మందమర్రిరూరల్(చెన్నూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలకు కాపలాదారులు లేకపోవడంతో అందులోని సామగ్రి చోరీకి గురవుతోంది. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని నాలువ వార్డు ప్రభుత్వ జూనియర్ కళాశాల (సారంగపల్లి రోడ్డు)పక్కన సుమారు ఎకరా విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిన అధికారులు అందులో వ్యాయామానికి సంబంధించిన పైపులను అమర్చారు. ప్రారంభం ఆర్భాటంగా జరిగినా తర్వాత దాని నిర్వహణ మర్చిపోవడంతో పైపులను దొంగలు కోసుకెళ్లారు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ రవాణా వాహనాలకు జరిమానా



పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టుకున్న టిప్పర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలో జాతీయ రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమదారిలో కంకర రవాణా సాగిస్తున్న రెండు టిప్పర్లను గురువారం మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలను హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచగా, ఒక్కో టిప్పర్‌కు రూ. 9,800చొప్పున రెండు వాహనాలకు రూ.19,600జరిమానా విధించినట్లు మైనింగ్ ఏడీ బాలు తెలిపారు.

కంది పంట దగ్ధం

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌లో నల్ల విఠల్‌రెడ్డికి చెందిన కంది కుప్ప బుధవారం రాత్రి దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది రెండెకరాలు కౌలుకు తీసుకుని అందులో కంది పంట వేశాడు. పంట కోతకు రావడంతో కోసి పంటచేనులోనే కుప్పగా వేశాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కుప్పకు నిప్పంటించారు. సుమారు పది క్వింటాళ్ల వరకు పంట దగ్ధమైందని, సుమారు రూ.90వేల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధిత రైతు వాపోతున్నాడు.

వివాహిత అదృశ్యం

సారంగపూర్(నిర్మల్): మండంలోని జామ్ గ్రామానికి చెందిన జంగం యమున అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని జామ్ గ్రామానికి చెందిన యమునకు ఎనిమిదేళ్ల క్రితం కామారెడ్డిలోని బ్రాహ్మణపల్లికి చెందిన జంగం అనిల్‌తో వివాహమైంది. భర్త అనిల్‌తో గొడవపడి నాలుగు నెలల క్రితం పుట్టింటికి వచ్చేసింది. ఇటీవల తన తండ్రి చేయి విరగడంతో ఆయుర్వేద చికిత్స నిమిత్తం గురువారం మామడ మండల కేంద్రంలో వైద్యం చేయించుకునేందుకు వెళ్లాడు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన అల్లమయ్యకు తన కుమార్తె కనిపించకపోవడంతో సమీప బంధువుల ఇళ్లలో వెతికాడు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.